# ఇదో తరహా

దాదాపు పాతికేళ్ళ క్రితం నా స్వదేశాన్ని స్వంత ఊరునీ ఒదిలిపెట్టి వెళ్ళిన నేను మా ఊరు విజయవాడని చూడగానే ఏదో నా స్వంత సామ్రాజ్యంలోకి కాలుపెట్టినట్టయింది. బంధువుల గురించీ, కుటుంబ మిత్రుల గురించీ ఆనాటి ఇరుగు పొరుగువారి గురించీ అమ్మ చెబుతూ వుంటే జీవితం ఎంత గమ్మత్తయినదో ఎవరెవరిని ఎన్నెన్ని మలుపులు తిప్పుతుందో విని ఆశ్చర్యపోయాను.

పక్కింట్లోని గుమాస్తా రామనాథం పిల్లలందరూ విదేశాల్లో సెటిలయి పోయారు. ఎదురింటి శేషాచారిగారు పదిమంది పిల్లలతో పస్తులుంటూ వచ్చిన వాళ్ళు, ఇప్పుడు పెద్ద పెద్ద ఉద్యోగాల్లో లక్షల ఆర్జనలో వున్నారు. అప్పుడు తళుక్కుమంది మదిలో అచ్చిరెడ్డి కుటుంబం, వాళ్ళ గురించి అమ్మ నడిగాను.

'అదో తరహాగా అయిపోయింది వాళ్ళ సంగతి' అంది అమ్మ. అదేమిటో అర్థంకాక వివరంగా చెప్పమన్నాను. అమ్మ చెప్పడం మొదలుపెట్టింది.

* * *

అచ్చిరెడ్డి ఆరోజుల్లోనే ఒక గొప్ప పేరున్న వ్యక్తి. షుగర్‌ఫ్యాక్టరీలో మేనేజరుగా పనిచేసేవాడు. చదివింది మెట్రిక్యులేషనే అయినా ఇంగ్లీషు బాగానే మాట్లాడేవాడు. విజయవాడ స్థల ప్రభావమేమో తెలుగూ స్పష్టంగా, చక్కగా మాట్లాడేవాడు. తరచూ బిజినెస్ పన్లమీద హైదరాబాద్ రావడం వల్ల, ఉర్దూ భాషలో కూడా ప్రవేశాన్ని పొందాడు. అతడికి కోటిరెడ్డి, వెంకటరెడ్డి, రాఘవరెడ్డి, సత్తిరెడ్డి అని నలుగురు కొడుకులూ, మణిమాల అని ఒక కూతురూ వుండేది.

అచ్చిరెడ్డి అదృష్టమేమోగానీ, రెండు చేతులా సంపాదించాడు. దురదృష్టం కూడా పక్కనే వుందేమో, భార్య సరళకి చక్కెర వ్యాధి, బ్లడ్ ప్రెషరు, గుండెపోటు, ఎప్పుడూ అస్వస్థతే. అచ్చిరెడ్డి పరపతీ, అంతస్తు ఎంత పెరుగుతూ వచ్చిందో సరళగారి జబ్బూ అంతే పెరుగుతూ వచ్చింది. అచ్చిరెడ్డికది భరించరాని బాధగా తయారయింది. అచ్చిరెడ్డి అసలే సరదామనిషి. తనకోసం వచ్చే మిత్రులూ, తన హోదా చూసొచ్చే బంధువులు, వాళ్ళని చూడడానికి ఎందరు పనివాళ్ళున్నా పనివాళ్ళకు సక్రమంగా పనిచేసే వాళ్ళు లేక పిల్లలందరూ చిన్న వాళ్ళయిపోవడం వల్ల, తన తలరాతకి కుంగిపోతూ వుండేవాడు.

తళుక్కున మెరిసింది అతని బుర్రలో చక్కటి ఆలోచన. ఎందరో మళ్ళీపెళ్ళి చేసుకోమని ఇచ్చిన సలహాలు త్రోసిపుచ్చాడు. సరళ మనసు నెమ్మదించింది. తన చెల్లెలి ఆడపడుచు కూతురు మంజుల తల్లీతండ్రీ లేక, అన్నా వదినల ఆలనాపాలనా కరువై అవస్థపడుతూంటే విని, తాను తన ఇంట్లో వుంచుకుని ఆమె బాధ్యతను నిర్వర్తించేటట్టు వ్యవహారం కుదుర్చుకున్నాడు.

మంజుల అన్నలకు, బూరెల బుట్టలో పడ్డట్టయింది. ఆ కుటుంబానికి మంజుల బంగారు బాతయింది. అచ్చిరెడ్డి ఇంటి తాళం చెవులు మంజుల బొడ్లోకొచ్చాయి. పెద్దబ్బాయి కోటిరెడ్డినీ, రాఘవరెడ్డినీ హైదరాబాద్ హాస్టల్లో వేశాడు. అచ్చిరెడ్డి విజయవాడలో చదువుకోవడం లేదని. ఆ ఇంట్లో ఎవరికేది కావాలన్నా అర్జీ మంజులకి పెట్టుకోవాలి. ఆమె తన భాషలో అచ్చిరెడ్డికి చెప్పి శాంక్షన్ చెయ్యడమో, తిరస్కరించడమో చేస్తుంది. సరళగారు చీర కొనుక్కోవాలన్నా అంతే, పనిమనిషికి వంద రూపాయలు కావాలన్నా అంతే!

జబ్బు కన్నా సరళగారికి మంజుల దగ్గర బానిసత్వం భరించరానిదయింది. గుండె జబ్బు ఎక్కువయింది. కోటిరెడ్డి, వెంకటరెడ్డి చదువు ఏమోగాని, లేనిపోని వ్యామోహాల్లో పడ్డారు. సిగరెట్లూ, డ్రింక్సూ అలవాటు చేసుకున్నారు. అచ్చిరెడ్డికి వారడిగినదంతా డబ్బు పంపడం తప్పితే, ప్రత్యక్షంగా వారికేం కావాలో తెలుసుకునే తీరికా లేదు, ఓపికాలేదు.

సెలవుల్లో ఇంటికొచ్చిన పిల్లలకి మంజుల పెత్తనం కంటకమనిపించింది. సరళ ఆవేదన ఆరాటాన్ని రేకెత్తించింది. అచ్చిరెడ్డి పిల్లలు రెచ్చిపోయినప్పుడు నచ్చజెప్పి వాళ్ళడిగిందల్లా ఇచ్చి శాంత పరిచి పంపించేవారు. అచ్చిరెడ్డి సంపాదన రెట్టింపవ్వడానికి మంజులే కారణమని అతడి భ్రమ. అతిథి మర్యాదలు, ఆదరణ మంజులవల్లే జరుగుతోందని అతడి తృప్తి! అందుకే ఆమె ఆడింది ఆట, పాడింది పాట.

గుప్పెడు మెతుకులకీ, ఒక్క కొత్త చీరకీ మొహం వాచిన మంజులకి అచ్చిరెడ్డి ఇల్లు స్వర్గలోకమే కదూ! నౌకర్లూ, చాకర్లూ, కార్లూ, షికార్లూ, పలుకుబడీ, పైసా! అంతకన్నా ఏం కావాలి?

అచ్చిరెడ్డికి బిజినెస్‌లోనే కాదు, ఇంట్లోనూ రాజకీయం వెన్నతో పెట్టిన విద్య. 'మంజులని నీకోసమే తెచ్చా. నీకు రెస్టుకావాలి కదా!' అనేవాడు. కోటిరెడ్డి, వెంకటరెడ్డిలతో, రాఘవరెడ్డి సత్తిరెడ్డిలతో 'మీ అన్నలిద్దరూ దద్దమ్మలు. ఈ ఊళ్ళో వాళ్ళకి చదువంటడంలేదు. అందుకే ఇంటికి దూరంగా అక్కడ పడేశా' అనేవాడు. దాంతో చిన్నవాళ్ళిద్దరూ 'మేము చాలా

ఉత్తములం' అనుకుంటూ తండ్రి గీసిన గీటు దాటేవారు కాదు. ఈ మాటలు వింటున్న మణిమాల హైదరాబాద్ అన్నలు చెడ్డవాళ్ళనీ, ఇక్కడున్నవాళ్ళే మంచివాళ్ళనీ అనుకుని అలాగే పెరిగి ఆ భావాలనే జీర్ణించుకుంది.

సరళగారి జబ్బు ముదిరిపోతూ వుంది. ఆమెలో ఎక్కువ రోజులు బతకనన్న అపనమ్మకం పట్టుకుంది. అచ్చిరెడ్డిని బలవంతపెట్టి, కోటిరెడ్డికీ, వెంకటరెడ్డికీ పెళ్ళిళ్ళు చేయించింది.

అచ్చిరెడ్డి కోడళ్ళ రాకతో, తనకు స్థానభ్రష్టత్వం వస్తుందేమోనన్న అనుమానంతో, మంజుల తనకు దూరపు బంధువైన శ్రీరాంను రిజిస్టర్ పెళ్ళి చేసుకుని నాగపూర్‌కి వెళ్ళిపోయింది. తనకి ఆస్తికి వాటాకావాలని కోర్టుకెళ్ళింది. అచ్చిరెడ్డి పిచ్చివాడయిపోయాడు ఈ అనుకోని పరిణామానికి. సరళ గుండె ఆగిపోయింది.

అంత్యక్రియలు జరిపి మణిమాలను అక్కున జేర్చుకుని బావురుమన్నాడు అచ్చిరెడ్డి. ఏదో భయం అతని నావరించింది. 'అందరూ కలిసి తనని దూరం చేస్తే? తన డబ్బు తీసుకుని తనని ఒదిలేస్తే?' 'ఇలాంటి అర్థంలేని ఊహలతో జీవితం పట్ల సరైన అవగాహన లేక, తప్పుడు నిర్ణయాలు తీసుకున్న అచ్చిరెడ్డి, కోడళ్ళిద్దరూ కలిసున్నా తనమీద కుట్ర పన్నుతున్నారేమోనని విడివిడిగా వాళ్ళని పిలిచి, ఒకరిమీద ఒకరికి చాడీలు చెబుతూ, ఎవరి ముందర వాళ్ళని పొగుడుతూ, వాళ్ళను విడివిడిగా ఆకట్టుకున్నాడు. అలాగే కోటిరెడ్డి స్వార్థ పరుడనీ, వెంకటరెడ్డి దుబారామనిషని, రాఘవరెడ్డి అమాయకుడనీ, ఒకళ్ళకి తెలీకుండా మరొకళ్ళకి ప్రచారం చేశాడు.

చిన్నవాడైన సత్తిరెడ్డి తండ్రి మాటలు అక్షరాలా నిజమని పాటిస్తూ, అన్నలనీ, ఒదినలనీ అనుమానంగా చూస్తూ, సైలెంట్ ఎనిమీగా తయారయ్యాడు. ఈ డివైడ్ అండ్ రూల్ పాలసీ కుటుంబంలో ఒకరిపై ఒకరికి సదభిప్రాయం లేకుండా చేసింది. ప్రేమానురాగాలనీ, బంధుత్వాన్నీ మంటగలిపింది.

ఎవరికి వారే అచ్చిరెడ్డికి సన్నిహితుల మనుకున్నారు. మణిమాలలో జీర్ణించుకున్న భావాలు మరింత విస్తరించి పెళ్ళికాని అన్నలే మంచి వాళ్ళనీ, పెళ్ళయిన వాళ్ళు స్వార్థపరులనీ నిర్ణయించుకుంది.

అచ్చిరెడ్డికి హఠాత్తుగా క్యాన్సరొచ్చింది. బోన్ క్యానర్. ఒక్క ఆడపిల్ల. దానికి పెళ్ళి చెయ్యలేదన్న బాధ ఎక్కువయింది.

ఆకతాయిగా తిరుగుతున్న రాఘవరెడ్డి, సత్తిరెడ్డిలు, తమ ఫ్రెండ్ రాజలింగాన్ని మణిమాలకిచ్చి పెళ్ళి చెయ్యమన్నారు. తాడూ, బొంగరం లేని రాజలింగానికి మణిమాలనివ్వడం అచ్చిరెడ్డికి ఇష్టంలేదు. తండ్రిపోతే పెద్దన్నలు తనని పట్టించుకోరేమనన్న భయంతో చిన్నన్నయ్యలు ప్రేమతో తెచ్చిన రాజలింగాన్ని పెళ్ళాడుతానని పట్టుపట్టింది మణిమాల. తత్ఫలితం మణిమాల రాజలింగం పత్నిగా మారింది.

ఇహ తన బాధ్యత తీరిపోయినట్టు హఠాత్తుగా కన్నుమూశాడు అచ్చిరెడ్డి. దాంతో ప్రారంభమయింది ఆ ఇంట్లో అంతర్యుద్ధం. రాజలింగం భార్య పేరుమీద ఆస్తిలో సగభాగం ఆమెకు దక్కాలని కోర్టుకెళ్ళాడు. రాఘవరెడ్డీ, సత్తిరెడ్డీ, అన్నలను నమ్మలేక, చెల్లెల్నీ, బావనీ కాదనలేక సతమతమయిపోయారు.

కోటిరెడ్డీ, వెంకటరెడ్డీ, వాళ్ళందరికీ నచ్చచెప్పలేక సతమతమయిపోతున్నారు. ఇంటి గుట్టు రచ్చనపడింది. కోర్టుకెక్కిన కుటుంబం, బంధుమిత్రులకి కులాసా కబుర్ల చర్చాంశమయింది. అచ్చిరెడ్డి అప్పుల లిస్టు బయటపడగానే, ఐపీ పెట్టేసి ఆ ఊరొదిలిపెట్టి వెళ్ళిపోయారు.

తండ్రి పేరు చెప్పుకుని చిన్న ఉద్యోగాలైనా దొరుకుతాయేమోననే ఆశతో చిన్న కొడుకులిద్దరూ చిన్నన్నలు పారిపోవడానికీ, తండ్రి అప్పులకీ పెద్దన్నయ్యలిద్దరూ, వదినలిద్దరూ కారణమని మణిమాల బంధువుల దగ్గరా, అచ్చిరెడ్డి స్నేహితుల దగ్గరా మొరపెట్టి కన్నీళ్ళు కారుస్తుంటే కాస్సేపు ఓదార్చారు.

జనం చాటుగా నవ్వుకున్నారు అస్తవ్యస్తాలకు లోనయిన అచ్చిరెడ్డి కుటుంబం గురించి. అదిరా వాళ్ళసంగతి!' చెప్పడం ఆపింది అమ్మ.

* * *

నా మనస్సు చివుక్కుమంది. ' తన స్వంత లాభం కోసం కన్న తండ్రే ఇలా ప్రవర్తిస్తే, ప్రపంచాన్ని తెలుసుకోవడానికి శక్తి చాలని పిల్లల గతేమిటి? వారిలో ఈ చీకటి పొరలెలా విడుతాయి? అనురాగాలతో, ఆనందాలతో తులతూగ వలసిన ఆ కుటుంబం ఛిన్నాభిన్నం కాకుండా కలుసుకునే దెలా?' ఈ ప్రశ్నలు నన్ను దహించివేశాయి.

ఇండియాలో పాతికేళ్ళు గడిపి, అనురాగాన్నీ, ఆప్యాయతలనీ చవిచూసి, పాతికేళ్ళు అమెరికాలో ఉండి స్వర్గసుఖాల రుచులను ఆకళింపు చేసుకున్న నాకు ఈ తరహా సమస్యని ఎలా పరిష్కరించాలో తెలీక తికమకపడ్డాను. ఆ మాటే పైకనేశాను.

అమ్మ అభిమానంగా నాకేసి చూస్తూ 'బాబూ! పెద్ద వాళ్ళెప్పుడూ స్వార్థంగా ఆలోచించకూడదు. తమ సుఖాన్ని తాము చూసుకుని సంతోషపడకూడదు. పిల్లల మధ్య ఒకరిమీద ఒకరికి చాడీలు చెప్పి వాళ్ళను విభజించకూడదు. వాళ్ళలో ఒకరిపై ఒకరికి అభిమానాన్ని పెంచాలి. అనురాగాన్ని కలిగించాలి. పెద్దలపట్ల గౌరవం నిలిచిపోయేలా చూసుకోవాలి. అది జరగనప్పుడు అస్తవ్యస్తాలూ, ఆటుపోట్లూ తప్పవు' అంది.

అమ్మ మాట గీతోపదేశంలా అనిపించింది. ఆలోచిస్తూ దినచర్యకు ఉపక్రమించాను.

*  *  *